పారిశుద్ధ్య పనులు చేయించిన అధికారులు

దోమకొండలో మురుగు కాలువలను శుభ్రం చేస్తున్న పంచాయతీ కార్మికులు

బీబీపేట్(దోమకొండ), ఫిబ్రవరి 22 : దోమకొండలోని 12, 15వ వార్డుల్లో గ్రామ పంచాయతీ అధికారులు కార్మికులతో మురికి కాలువలను శుభ్రం చేయించారు. గ్రామాభివృద్ధిని పట్టించుకునేదెవరూ.. అనే శీర్షికన కథనం 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో శుక్రవారం ప్రచురితం కావడంతో డీఎల్‌పీవో శ్రీనివాస్ స్పందించారు. ఆయన ఆదేశాలు, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ సూచనల మేరకు పంచాయతీ కార్యదర్శి యాదగిరి మురికి కాలువలను శుభ్రం చేయించారు. నీటి సమస్య లేకుండా చూస్తామన్నారు. కాలనీ వాసులు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

మైనార్టీ గురుకుల బాలుర పాఠశాల పరిశీలన

కామారెడ్డి, ఫిబ్రవరి 21 : కామారెడ్డి పట్టణంలోని మైనార్టీ గురుకుల బాలుర పాఠశాలను జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి దయానంద్ శుక్రవారం సందర్శించారు. విద్యార్థులతో కాసేపు మాట్లాడారు. కళాశాలలో ఉన్న వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు గంగారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో ఒకరి ఆత్మహత్య

భిక్కనూరు, ఫిబ్రవరి 21 : మద్యానికి బానిసై అప్పులు ఎక్కువ కావడంతో జీవితంపై విరక్తి చెందిన ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని జంగంపల్లి గ్రామానికి చెందిన సైదుగారి సత్తయ్య(37) ఈ నెల 19న వంటలు చేయడానికి వెళ్తున్నానని చెప్పి ఇంట్లో నుంచి వెళ్లాడు. శుక్రవారం ఉదయం గ్రామ శివారులో ఉన్న కొత్త కుంటలో శవమై తేలినట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ విషయాన్ని పోలీసులకు సమాచారం అందించగా మృతదేహాన్ని కుంటలో నుంచి బయటికి తీయించారు. మృతుడి అన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వ్యాధుల గుర్తింపు కోసం ఇంటింటి సర్వే

బాన్సువాడ, ఫిబ్రవరి 21 : పట్టణంలో ఎన్‌సీడీ ప్రోగ్రాంలో భాగంగా అసంక్రమిత వ్యాధుల గుర్తింపుకోసం ఆరోగ్య సిబ్బంది శుక్రవారం ఇంటింటి సర్వే నిర్వహించారు. బీపీ, షుగర్ తదితర వ్యాధులు ఉన్నవారిని గుర్తించి, వ్యాధి నివారణ చర్యలు చేపట్టేందుకు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు సీహెచ్‌వో దయానంద్ తెలిపారు. అంజలి, మంజూల, శోభా, భార్గవి, నర్సులు పాల్గొన్నారు.

స్పెల్ బీ పోటీల్లో విద్యార్థుల హవా

కామారెడ్డి రూరల్, ఫిబ్రవరి 21 : కాకతీయ సౌండ్ బాక్స్ దేశ్‌పాండే ఫౌండేషన్ నిజామాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి స్పెల్‌బీ పోటీల్లో గర్గుల్‌లోని ప్రభుత్వ పాఠశాలకు చెందిన 8వ తరగతికి చదువుతున్న ఝాన్సీ అనే విద్యార్థిని 2025 రాష్ట్రస్థాయి పోటీల్లో 44 మార్కులు సాధించి 4వ స్థానంలో నిలిచింది. ప్రధానోపాధ్యాయుడు, కామారెడ్డి మండల విద్యాశాఖ అధికారి ఎల్లయ్య హర్షం వ్యక్తం చేశారు. ఫౌండేషన్ టీచర్ అనూష కృషిని అభినందించారు.

ప్రతిరోజూ పారిశుద్ధ్య పనులు నిర్వహించాలి

కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

కామారెడ్డి, ఫిబ్రవరి 21 : పట్టణంలో నిరంతరం పారిశుద్ధ్య పనులు నిర్వహించాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అన్నారు. పట్టణంలోని విద్యానగర్, రామారెడ్డి బైపాస్ ప్రాంతాల్లో కలెక్టర్ శుక్రవారం పర్యటించారు. మున్సిపల్ అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఇంటింటి చెత్త సేకరణ ప్రతిరోజూ నిర్వహిస్తే వీధుల్లో గృహిణులు చెత్త వేయరని, ప్రతిరోజూ ఇంటి నుంచి తడి, పొడి చెత్తను పారిశుద్ధ్య సిబ్బంది సేకరించాలని సూచించారు. రోడ్లపై వేయకుండా చెత్త బుట్టలో వేసేలా ప్రజలకు అవగాహన కల్పించేలా ప్రచారం చేయాలన్నారు. మున్సిపల్ ఆధీనంలో ఉన్న ఖాళీ స్థలాలు ఆక్రమణకు గురికాకుండా ఆయా వార్డు, మున్సిపల్ అధికారులు పర్యవేక్షించాలని చెప్పారు. చెత్తను రోడ్లపై వేస్తే మున్సిపల్ యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌రెడ్డి, డిప్యూటీ ఈఈ వేణుగోపాల్, ఏఈఈ శంకర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు చేసుకోవాలి

ఉమ్మడి మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రవర్తనా నియమావళి, పోలింగ్ సిబ్బంది బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పత్రాల ముద్రణ, పోస్టల్ బ్యాలెట్ జారీకి అసవరమైన ఏర్పాట్లు చేసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్ నుంచి కలెక్టర్లు, ఎస్పీలు, అధికారులతో శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన వసతులు, వెబ్ కాస్టింగ్, డిస్ట్రిబ్యూషన్ రిసెప్షన్ కేంద్రాల వద్ద ఏర్పాట్లు, పోలీసు బందోబస్తు తదితర అంశాలపై సూచనలు చేశారు. కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. జిల్లాలో 54 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్పీ సింధూశర్మ, అదనపు కలెక్టర్లు విక్టర్, శ్రీనివాస్‌రెడ్డి, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

రామారెడ్డి బైపాస్ ప్రాంతంలో పర్యటిస్తున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

యోగా రాంరెడ్డికి జాతీయ సేవ్ పురస్కార్ అవార్డు

కామారెడ్డి, ఫిబ్రవరి 21 : భాగ్యనగర్ శివాజీ సేవా సమితి వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా గురువారం రాత్రి హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కామారెడ్డికి చెందిన యోగా గురువు రాంరెడ్డి జాతీయ సేవ్ పురస్కార్ అవార్డును అందుకున్నారు. కామారెడ్డి యోగా సభ్యులైన అంజయ్య, రఘుకుమార్, సిద్దాగౌడ్, లక్ష్మీపతి యాదవ్, వెంకటేశం, హిమాబిందు, మంగమ్మ, సాయిసుధాను సత్కరించారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు విరాళం

మాచారెడ్డి, ఫిబ్రవరి 21 : మండలంలోని అక్కాపూర్ గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటుపై ఎస్సై అనిల్ శుక్రవారం అవగాహన కల్పించారు. గ్రామస్తులు సీసీ కెమెరాల ఏర్పాటుకు ఎస్సై ఆధ్వర్యంలో రూ.60 వేలు జమచేసి అందజేశారు. కార్యక్రమంలో బాల్‌చంద్రం, రాజలింగం, బాబు, విజయ్‌రెడ్డి, ఎల్లయ, శ్రీనివాస్‌రెడ్డి, సంజీవ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇసుక లారీ సీజ్

మాచారెడ్డి, ఫిబ్రవరి 21 : పాల్వంచ మండలంలోని ఫరీద్‌పేట గ్రామం నుంచి అక్రమంగా తరలిస్తున్న ఇసుక లారీని సీజ్ చేసినట్లు ఎస్సై అనిల్ తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్నారని సమాచారం మేరకు దాడి నిర్వహించి ఇసుకతోపాటు లారీని సీజ్ చేసినట్లు తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

టీయూలో ముగిసిన జాతీయ సెమినార్

భిక్కనూరు, ఫిబ్రవరి 21 : భిక్కనూరు పరిధిలోని టీయూ సౌత్ క్యాంపస్‌లో సోషల్ వర్క్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ సెమినార్ శుక్రవారం ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ హయ్యర్ ఎడ్యుకేషన్ చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి, విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ యాదగిరి హాజరయ్యారు.

పేకాడుతున్న ఎనిమిది అరెస్టు

మాచారెడ్డి, ఫిబ్రవరి 21 : పాల్వంచ మండలం ఏల్పుగొండ శివారులో లొట్టి వాగులో పేకాడుతున్నారని సమాచారం మేరకు శుక్రవారం దాడులు నిర్వహించినట్లు ఎస్సై అనిల్ తెలిపారు. ఎనిమిది మందితోపాటు రూ.7,150, నాలుగు మొబైల్స్, ఐదు బైక్‌లు స్వాధీనం చేసుకొన్నట్లు ఎస్సై తెలిపారు.

వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చూడాలి

బీబీపేట్(దోమకొండ), ఫిబ్రవరి 21 : వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చూడాలని అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్‌కు సూచించారు. దోమకొండలోని ఎంపీడీవో కార్యాలయం, ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రం, డంపింగ్ యార్డును శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. గ్రామాల్లో వంద శాతం ఇంటి పన్ను వసూలు చేయాలన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్యలు లేకుండా చూడాలన్నారు. ప్రతి రోజూ పారిశుద్ధ్య పనులు చేయించాలన్నారు. మండల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మత్తుభాష కార్యక్రమంలో పాల్గొన్ని విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ సంజయ్‌రావు, ఎంపీఎం రాజు, ఎంపీడీవో, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

రెండు నాటు తుపాకులు స్వాధీనం

బాన్సువాడ, ఫిబ్రవరి 21 : మండలంలోని చిన్నరాంపూర్ గ్రామానికి చెందిన ఇషాబిన్ సయ్యద్ ఇంట్లో రెండు నాటు తుపాకులు స్వాధీనం చేసుకున్నామని బాన్సువాడ ఎస్‌హెచ్‌వో అశోక్ శుక్రవారం తెలిపారు. ఎస్‌హెచ్‌వో తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చిన్న రాంపూర్ గ్రామానికి చెందిన ఇషాబిన్ సయ్యద్ ఇంట్లో ఎలాంటి ప్రభుత్వ అనుమతి లేకుండా దేశీయంగా తయారు చేసిన తుపాకులు ఉన్నాయని విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో బాన్సువాడ ఎస్సై మోహన్‌ను చిన్న రాంపూర్‌కు వెళ్లి ఇషాబిన్ సయ్యద్ ఇంట్లో తనిఖీ చేయాలని ఆదేశాలు అందాయి. ఇషాబిన్ సయ్యద్ ఇంట్లో ఎస్సై తనిఖీ చేశారు. ఏఎస్సై, ఎస్సై విచారించగా నాటు తుపాకులకు సంబంధించి ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేవు. తన వద్ద రెండు దేశీయంగా తయారు చేసిన తుపాకులు ఉన్నాయని ఇషాబిన్ సయ్యద్ ఒప్పుకున్నట్లు తెలిపారు. అవి పూర్వీకులకు చెందినవని, అప్పట్లో అడవిలో జంతువులను వేటాడేందుకు వెళ్లేవారని ఇషాబిన్ అంగీకరించాడు. ఇటీవల అతను ఆ రెండు నాటు తుపాకులతో జంతువులను వేటాడేందుకు అడవికి వెళ్లాడని, కానీ.. ఇషాబిన్‌కు ఏ జంతువు దొరక్కపోవడంతో ఆ తుపాకులు తెచ్చి ఇంట్లో పెట్టుకున్నాడని పోలీసులు తెలిపారు. చట్టం ప్రకారం నిందితుడిని అరెస్టు చేసి కోర్టుకు తరలించినట్లు తెలిపారు.

నిధులు విడదల చేయాలని వినతి

రాజంపేట్, ఫిబ్రవరి 21 : మండలంలోని గ్రామ పంచాయతీలకు పెండింగ్‌లో ఉన్న నిధులను విడుదల చేయాలని ఎంపీడీవో రాజేశంకు పంచాయతీ కార్యదర్శులు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. వేసవి కాలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా నిధులు మంజూరు చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు.

కోదండరాం మాటలను ఖండిస్తున్నాం

మాట్లాడుతున్న ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ అరవింద్

కామారెడ్డి, ఫిబ్రవరి 21 : ఆర్ఎంపీ, పీఎంపీలకు శిక్షణ ఇచ్చేలా చేస్తామని కోదండరాం చెప్పడాన్ని ఖండిస్తున్నామని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ అరవింద్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఐఎంఏ హాల్ లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన ఆర్ఎంపీ, పీఎంపీనీ ఆత్మగౌరవ సభలో ఎమ్మెల్సీ కోదండరాం ఆర్ఎంపీ, పీఎంపీలకు శిక్షణ ఇచ్చేలా ప్రయత్నిస్తామని పేర్కొనడం సబబు కాదని అన్నారు. తాము ఎంతో కష్టపడి ఎంబీబీఎస్, ఎండీ వంటి ఉన్నత చదువులు చదివి, సర్టిఫికేట్ తెచ్చుకొని వైద్య వృత్తి చేస్తున్నామన్నారు. కానీ ఎలాంటి అర్హత లేకున్నా మూడు నెలలు శిక్షణ పొంది సర్టిఫికెట్ తెచ్చుకొని వైద్యం చేస్తామనడం సరికాదన్నారు. ఎన్ఎంపీ 34 యాక్ట్ ప్రకారం రిజిస్ట్రేషన్ చేసుకున్నాకే ప్రాక్టీస్ చేయాల్సి ఉంటుందని కానీ.. గ్రామాల్లో ఎలాంటి రిజిస్ట్రేషన్ లేకుండా చికిత్స ఎలా చేస్తారని ప్రశ్నించారు. ఫస్ట్‌ఎయిడ్ పేరుతో అమాయకుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని ఆరోపించారు. ఇలాంటి చర్యలను ప్రభుత్వం ప్రోత్సహించవద్దని కోరారు. కార్యక్రమంలో వైద్యులు పుట్ట మల్లికార్జున్, రమేశ్‌బాబు, చంద్రశేఖర్, ఉమారెడ్డి, నవీన్, జమాల్, రమేశ్, రవికిరణ్, గీరెడ్డి రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నీటి నాణ్యతపై అవగాహన సదస్సు

బీబీపేట్, ఫిబ్రవరి 21 : భూగర్భ జల శాఖ, నేషనల్ హైడ్రోలజి ప్రాజెక్టు ఆధ్వర్యంలో నీటి నాణ్యతపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేకాధికారి సతీశ్‌యాదవ్ మాట్లాడుతూ.. నీటిని వృథా చేయకుండా జాగ్రత్తగా వాడుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీవో పూర్ణ చంద్రోదయకుమార్, ఆర్ఐ రాము, పంచాయతీ కార్యదర్శులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

క్రీడా పోటీలు ప్రారంభం

బాన్సువాడ రూరల్, ఫిబ్రవరి 21 : బాన్సువాడ మండలంలోని దేశాయిపేట్ గ్రామంలో శ్రీరాంనారాయణ్‌ఖేడియా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో క్రీడా పోటీలను కళాశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల స్వామి శుక్రవారం ప్రారంభించారు. పోటీల్లో గెలుపొందిన వారికి రజతోత్సవ వేడుకల్లో బహుమతులు ప్రదానం చేస్తామని ప్రిన్సిపాల్ తెలిపారు.

వ్యక్తిపై పోక్సో కేసు నమోదు

బీబీపేట్(దోమకొండ), ఫిబ్రవరి 21: దోమకొండ మండలంలోని ఒక గ్రామానికి చెందిన బాలికపై అదే గ్రామానికి చెందిన ఓ యువకుడు లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు శుక్రవారం యువకుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఎస్సై స్రవంతి తెలిపారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న అధికారులు

పెద్ద కొడప్‌గల్, ఫిబ్రవరి 21: విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని మండల ప్రత్యేకాధికారి కిషన్ అన్నారు. మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలను ఆయన శుక్రవారం సందర్శించారు. విద్యార్థుల కోసం వండిన భోజనాన్ని తనిఖీ చేసిన అనంతరం వారితో కలిసి భోజనం చేశారు. స్టోర్ రూమ్, స్టాక్ రిజిస్టర్లను తనిఖీ చేశారు. నిత్యం అవసరమయ్యే వంట సరుకులు, ఇతర అంశాలను ప్రిన్సిపాల్ సునీతను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో తాగునీటి సమస్య లేకుండా చూసుకోవాలని సూచించారు. తహసీల్దార్ దశరథ్, ప్రిన్సిపాల్ సునీత, ఎంపీడీవో లక్ష్మీకాంత్‌రెడ్డి, ఏపీవో సుదర్శన్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాలను గుర్తించాలి

మస్టర్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీవో నరేశ్

లింగంపేట, ఫిబ్రవరి 21: మండలంలో నీటి ఎద్దడి ఉన్న గ్రామాలను గుర్తించాలని ఎంపీడీవో నరేశ్ అన్నారు. లింగంపేట ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ క్షేత్ర సహాయకులతో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. నీటి సమస్య ఉన్న ప్రాంతాల్లో అద్దె బోరు బావులను గుర్తించాలని సూచించారు. గ్రామాల్లో చేపడుతున్న ఉపాధి హామీ పథకం పనుల్లో కూలీల సంఖ్య పెంచాలన్నారు. వన మహోత్సవంలో భాగంగా గ్రామాల్లో నాటడానికి కావాల్సిన మొక్కలు సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు.

మస్టర్లలో హాజరు నమోదు చేయాలి..

ఉపాధి హామీ పథకం పనులకు హాజరైన కూలీల పేర్లు మస్టర్లలో తప్పకుండా నమోదు చేయాలని ఎంపీడీవో నరేశ్ ఉపాధి సిబ్బందికి సూచించారు. లింగంపేట మండలం కొండాపూర్, భవానీపేట, ముంబాజీపేట, జల్దిపల్లి గ్రామాల్లో చేపడుతున్న ఉపాధి హామీ పథకం పనులను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మస్టర్లు పరిశీలించారు. పనులకు కూలీలు ఎక్కువ సంఖ్యలో హాజరయ్యేలా చూడాలని సూచించారు. కూలీలు కొలతల ప్రకారం పనులు చేయాలని సూచించారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

రామారెడ్డి, ఫిబ్రవరి 21: అనారోగ్యంతో బాధపడుతూ ఆత్మహత్యాయత్నం చేసిన మహిళ చికిత్స పొందుతూ మృతిచెందింది. సదాశివనగర్ ఎస్సై రంజిత్ తెలిపిన వివరాల ప్రకారం.. అడ్లూర్ ఎల్లారెడ్డికి చెందిన నూనె పోశవ్వ(35) కొంత కాలంగా దగ్గుదమ్ముతో బాధపడుతున్నది. దవాఖానల్లో చూపించుకున్నా వ్యాధి తగ్గలేదు. దీంతో మనస్తాపం చెందిన ఆమె.. బుధవారం ఎలుకల మందు తాగింది. అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను కుటుంబీకులు, స్థానికులు కామారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతిచెందింది. మృతురాలి బావ సాయిలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు. మృతురాలికి ఇద్దరు పిల్లులు ఉన్నారని తెలిపారు.

సంతానం కలుగడం లేదని వివాహిత ఆత్మహత్య

రామారెడ్డి, ఫిబ్రవరి 21: సంతానం కలుగడం లేదని వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన సదాశివనగర్ మండలంలోని అమర్ల బండ గ్రామంలో చోటుచేసుకున్నది. ఎస్సై రంజిత్ తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఎర్రోళ్ల సత్తవ్వ(38)కు 20 ఏండ్ల క్రితం వివాహం అయ్యింది. ఆమెకు ఇంకా సంతానం కలుగలేదు. ఆమె తల్లి పద్మాజివాడి నుంచి కూతురు ఇంటికి వచ్చింది. తనకు సంతానం కలుగడం లేదని తల్లితో బాధను చెప్పుకున్నది. గురువారం రాత్రి కుటుంబ సభ్యులు పడుకున్న అనంతరం ఇంటి వెనుక ఉన్న పాత ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నది. మృతురాలి అన్న నర్సాపురం సాయిలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అటవీ ప్రాంతంలో తవ్వకాలు

- **నిందితులను పట్టుకొని పోలీసులకు అప్పగించిన గౌరారం గ్రామస్తులు**

మర్రి చెట్టు కింద తీసిన గుంత

గాంధారి, ఫిబ్రవరి 21: మండలంలోని గౌరారం గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో పలువురు తవ్వకాలు జరిపారు. వారిని గ్రామస్తులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. గ్రామస్తులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామంలోని పెద్ద చెరువుకు వెళ్లే దారిలోని అటవీ ప్రాంతంలో మర్రి చెట్టు కింద శుక్రవారం నలుగురు మహిళలు, ఒక మగ వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించారు. గమనించిన అక్కడి రైతులు.. గ్రామస్తులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి వెళ్లిన గ్రామస్తులు మర్రి చెట్టు కింద ఉన్న పుట్ట వద్ద పసుపు, కుంకుమతో పాటు నిమ్మ, గుమ్మడికాయులు కొట్టి, నల్ల కోడిని కోసినట్లు గుర్తించారు. పూజలు చేసిన వారిని గ్రామస్తులు నిలదీయగా.. పొంతన లేని సమాధానం ఇచ్చారు. దీంతో గ్రామస్తులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. గాంధారి పోలీసులు అక్కడికి చేరుకొని అనుమానితులను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

పల్టీకొట్టిన తూఫాన్ వాహనం

ఒకరి పరిస్థితి విషమం

వినాయక్‌నగర్, ఫిబ్రవరి 21 : నిజామాబాద్ రూరల్ పరిధిలోని మల్లారం అటవీప్రాంతంలో శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డుప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు కావడంతోపాటు పలువురికి గాయాలయ్యాయి. రూరల్ ఎస్సై మహ్మద్ ఆరిఫ్ కథనం ప్రకారం.. బాన్సువాడ, పిట్లం మండలాలకు చెందిన ఏడుగురు తూఫాన్ వాహనంలో కుంభమేళా యాత్రకు వెళ్లి, బాన్సువాడ వైపు వస్తున్నారు. మల్లారం గ్రామశివారులోని అటవీ ప్రాంతంలో మూలమలుపు వద్ద ఎదురుగా ద్విచక్రవాహనం రావడంతో రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో తూఫాన్ వాహనం పల్టీకొట్టి, అందులోని పలువురికి గాయాలయ్యాయి. ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. అదే సమయంలో సౌత్ రూరల్ సీఐ సురేశ్ కుమార్, రూరల్ ఎస్సై ఆరిఫ్ అటు వెళ్తుండగా రోడ్డుప్రమాదాన్ని గమనించి, 108 అంబులెన్స్‌లో క్షతగాత్రులకు దవాఖానకు తరలించారు. ద్విచక్రవాహనంపై ఉన్న క్షతగాత్రుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆర్టీసీ బస్సు, బైకు ఢీ : ముగ్గురికి గాయాలు

సిరికొండ/ రామారెడ్డి, ఫిబ్రవరి 21: రామారెడ్డి మండలంలోని స్కూల్ తండా శివారులో శుక్రవారం ఆర్టీసీ బస్సు బైకును ఢీకొనడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన ప్రకారం.. కామారెడ్డి నుంచి భీమ్‌గల్ వెళ్తున్న బస్సు.. స్కూల్ తండా వద్ద బైక్‌ను ఢీకొన్నది. ఈ ప్రమాదంలో బైక్‌పై కొండాపూర్ వెళ్తున్న స్వామితోపాటు మరో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు అంబులెన్స్‌లో కామారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ప్రమాదానికి కారణమైన బస్సును పోలీసులు రామారెడ్డి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

విభిన్న సంస్కృతుల సమ్మేళనమే భారతదేశం

ఎల్లారెడ్డి రూరల్, ఫిబ్రవరి 21: విభిన్న సంస్కృతుల సమ్మేళనమే భారతదేశమని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్‌ప్రిన్సిపాల్ చంద్రకాంత్ అన్నారు. ఎల్లారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సంప్రదాయ వస్త్రధారణ పోటీలను శుక్రవారం నిర్వహించారు. పోటీల్లో భాగంగా విద్యార్థులు పలు రాష్ట్రాల సంప్రదాయ దుస్తులను ధరించి అలరించారు. టీఎస్‌కేసీ ఇన్‌చార్జి శివకుమార్, అధ్యాపకులు నాగనిక, అరుణ్‌కుమార్, గంగారెడ్డి, సిద్ధిరాజు, గోదావరి, శశిధర్, రాణి, మోహిన్, సంగీత, దశరథ్, విద్యార్థులు పాల్గొన్నారు.

వివిధ రాష్ట్రాల సంప్రదాయ దుస్తుల వేషధారణలో విద్యార్థులు

విద్యార్థులకు నేత్ర పరీక్షలు

ఎల్లారెడ్డి రూరల్, ఫిబ్రవరి 21: జిల్లా అంధత్వ నివారణ సంస్థ, ఆర్‌బీఎస్‌కే బృందం సంయుక్త ఆధ్వర్యంలో ఎల్లారెడ్డి సీహెచ్‌సీలో శుక్రవారం బడిపిల్లలకు ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా నేత్ర వైద్య సహాయ అధికారి మండలంలోని పలు పాఠశాలలకు చెందిన 136 మందిని పరీక్షించి 63మందికి లోపాలు ఉన్నట్లు గుర్తించారు. అవసరం ఉన్న వారికి కండ్ల అద్దాలను ఇస్తామని చెప్పారు. ఇద్దరు విద్యార్థులను మెరుగైన వైద్యం కోసం బాన్సువాడ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ఆర్‌బీఎస్‌కే డాక్టర్లు క్రాంతికుమార్, సంజయ్, నిఖత్, ఫార్మాసిస్ట్ ఉమ, స్వప్న, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్త మంజుల పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వక్త శ్రీనివాస్‌రెడ్డి

వృత్తి విద్యా కోర్సులపై అవగాహన

బిచ్కుంద, ఫిబ్రవరి 21: బిచ్కుంద ప్రభుత్వ డిగ్రీ కాలేజీ(అటానమస్)లో తృతీయ సంవత్సరం విద్యార్థులకు డిగ్రీ అనంతరం ఎంచుకునే పలు కోర్సులపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఐక్యూఏసీ, ప్లేస్‌మెంట్ విభాగంలో ఏర్పాటు చేసిన ఈ సదస్సుకు ప్రముఖ వక్త శ్రీనివాస్‌రెడ్డి హాజరై విద్యార్థులకు పలు సూచనలు చేశారు. కాలేజీ ప్రిన్సిపాల్ అశోక్ మాట్లాడుతూ.. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు తమ నైపుణ్యాలు పెంచుకునేందుకు ఇలాంటి సదస్సులు ఎంతో దోహదపడుతాయని చెప్పారు. సదస్సులో ఐక్యూసీ కో-ఆర్డినేటర్